# నీకూ నాకు ఒకడే హీరో

ఇరవై ఏళ్ళ తర్వాత రేవతి మళ్ళీ ఇండియాకి వచ్చింది!

అయితే అప్పటికీ- ఇప్పటికి వక్కటే తేడా!

అప్పుడు తన భర్త రాబర్ట్‌తో వెళ్ళింది.... ఇప్పుడు తన కూతురు 'డాలీ'తో వచ్చింది.

తన జీవితంలో మళ్ళీ ఇండియా రావల్సివస్తుందని రేవతి ఎప్పుడూ అనుకోలేదు... కానీ అనుకోకుండానే ఇప్పుడిలా రావల్సివచ్చింది.

'డాలీ'తో వచ్చింది.... 'డాలీ' భవిష్యత్తుకోసం వచ్చింది.

తన ఏకైక సంతానం డాలీ!... తన కలలకు ప్రతిరూపంగా తన ఆశలకు వారసురాలిగా 'డాలీ'ని పెంచుకుంది....

'డాలీ' తన కడుపున పడకపోతే రేవతి అసలు అమెరికా వెళ్ళేది కాదు...

'డాలీ' పుట్టి వుండకపోతే తాను ఇక్కడకు మళ్ళీవచ్చి వుండేది కాదు... అందుకు కారణం లేకపోలేదు!

తనకంటూ ఇక్కడ ఏమీలేదు.... తనవాళ్ళంటూ ఈదేశంలో ఎవ్వరూలేరు.

కానీ....

ఇరవై ఏళ్ళ క్రితం—

తాను అమెరికా వెళ్ళకముందు—

తెనాలిదగ్గర ఓ పల్లెటూర్లో తనదంటూ చెప్పుకొనేందుకు శిధిలావస్థకొచ్చిన ఓ పెంకుటిల్లుండేది... ఆ ఇంట్లో విరిగిపోయిన నులక మంచంమీద పక్షవాతంతో పడిపోయిన కన్నతల్లి వుండేది! ఆవిడ ప్రాణాల్ని నిలబెట్టవలసిన బాధ్యతకూడా రేవతికే ఉండేది!

అప్పట్లో తనకు పాతికేళ్ళ వయసుండేది!

అపురూపమైన రూపలావణ్యాలు లేకపోయినా - ఆమె ప్రమేయం లేకుండా వచ్చిపడిన వయస్సూ-ఆ వయసు తెచ్చిపడేసిన అందాలూ ఆమెకు ఆకర్షణ నిచ్చేవి.

ఆ ఆకర్షణే - అనుకోకుండా ఆమెను రంగస్థల నటిగా తీర్చి దిద్దింది. నాటకరంగం ఆమె జీవనోపాధికి ఆలంబనమైంది.... రంగస్థల నటిగా ఆమెకు ఓ ఉనికి ఏర్పడింది.... ఆదాచేసుకునేటంత ఆదాయం లేకపోయినా సాదాసీదాగా బ్రతకటానికీ - ఆకలి చల్లార్చుకోటానికీ సరిపోయేది....

అభినందన పరంపరలూ ... కరతాళధ్వనులూ .... ఉత్తమ నటి సత్కారాలూ...ఇవన్నీ ఆమెలో క్రమేపీ కొత్త ఆశల్ని చిగురింపచేశాయి...

ఎవరో అన్నట్టు – 'ఆశ' అనేది మోహపాశమేకావచ్చు...కానీ జీవితం ఆవలితీరం చేరేవరకూ అది మనల్ని తనవెంట తీసుకువెడుతూనే వుంటుంది.

ఆ 'ఆశే' రేవతిని రెచ్చగొట్టింది...

'తాను సినీమాల్లో ఎందుకు నటించకూడదు ?"—

అద్దంముందు కూర్చుని—ముఖానికి రంగు వేసుకుంటున్నప్పుడల్లా అదే ఆలోచన ఆమె మనసులోంచి పెల్లుబికి—కళ్ళల్లో కదలాడేది.

ఓ రోజున—

ఆరోజు కాస్తా రానే వచ్చింది...

రవీంద్ర భారతిలో జరుగుతున్న నాటకోత్సవాలకు ముఖ్య అతిధిగా వచ్చిన ఓ ప్రముఖ దర్శక నిర్మాత—స్టేజిమీద రేవతి పాత్రపోషణ చూశాడు.... నిండు మనసుతో ఆశీర్వదించాడు. నిజాయతీతో—ఆమెకు తన సినీమాలో వేషం ఇచ్చాడు....

అదీ ఒక్కసారిగా హీరోయిన్ వేషం!....

అందునా సుకుమార్ పక్కన!....

అప్పటికే సుమారు ఇరవై అయిదు సినీమాల్లో నటించి- చలన చిత్ర సీమలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నవాడు సుకుమార్!

ఆతను నటించిన సినీమాకి మినిమమ్ గ్యారంటీ వుంటుందని పరిశ్రమలో ఓ నమ్మకం ఏర్పడిపోయింది.... అందుకే మరో పాతిక సినీమాల్లో నటించటానికి- కాల్‌షీట్స్ ఇచ్చాడు...

సుకుమార్ నటించిన సినీమాల్ని చూడకుండా వదిలిపెట్టేది కాదు రేవతి....

తన అభిమాన హీరో సుకుమార్!....

ఆలాంటి సుకుమార్ పక్కన తాను నటించాలన్న వార్త విన్న ప్పుడు రేవతి మైమరచి పోయింది.... మొట్టమొదటిసారిగా స్టూడియోలో సుకుమార్ని చూసినప్పుడు ఆమాటే చెప్పింది-

'మీరంటే నాకు చాలా ఇష్టం!....ఇవాళ మీ పక్కన నటించటం నా అదృష్టం!'- అంది.

సుకుమార్ - సుకుమారంగానే ఆరనవ్వు నవ్వాడు.... ఆనవ్వు ఆమెను పులకింపచేసింది.... రానురాను ఆనవ్వుకోసం అతన్ని మరింత ఆరాధించటం ప్రారంభించింది....

ఆ సినీమా షూటింగ్ జరుగుతున్న రోజుల్లోనే రేవతి త మరణించింది.... అప్పుడు సుకుమార్ దగ్గరుండి ఆవిడకు దహ సంస్కారాలు జరిపించాడు.... రేవతికి ధైర్యం చెప్పి మామూల

మనిషిని చేశాడు. షూటింగ్‌లేని రోజుల్లో ఆమెను షికార్లకు తీసుకు వెళ్ళేవాడు....

అంతటి పేరు ప్రఖ్యాతులున్న సుకుమార్ తనను అంతగా అభిమానించి చేరదీస్తున్నందుకు రేవతి పొంగిపోయింది.

తనను బుక్ చేసుకోటానికి వచ్చిన ఒకరిద్దరు నిర్మాతలకు రేవతిని పరిచయం చేసి, ఆమెక్కూడా ఆ సినిమాల్లో వేషాలు ఇప్పించాడు. మొదటి సినిమా విడుదల కాబోయేలోగా— మరో రెండు సినిమాల్లో ఆమెకు అవకాశాలొచ్చాయి...

ఒకరోజున రేవతి సెట్లో వుండగా, షూటింగ్ చూసేందుకు అమెరికన్ కళాకారుల బృందం వచ్చింది... ఆ బృందానికి నాయకత్వం వహిస్తున్న రాబర్ట్— రేవతి నటనకు ముగ్ధుడయ్యాడు.

'నీలాంటి ఆర్టిస్టు మా డ్రామా ట్రూపులో వుంటే బావుంటుంది!' అన్నాడు ఆమెను అభినందిస్తూ.

అతను తెలుగులో మాట్లాడటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

'మీకు తెలుగువచ్చునా ?'— అడిగిందామె...

'కొంచెం... కొంచెం!... నాకు పదేళ్ళ వయస్సు వచ్చే వరకూ ఇండియాలోనే ఉండేవాణ్ణి ఆ తర్వాత మా అంకుల్‌తో అమెరికా వెళ్ళిపోయాను.... అక్కడే థియేటర్ ఆర్ట్స్‌లో డిగ్రీ తీసుకున్నాను. చెప్పాడతను....

ఆరాత్రి అమెరికన్ కళాకారుల బృందానికి సినీపరిశ్రమలో ప్రముఖులు కొందరు డిన్నర్ ఏర్పాటు చేశారు....

డిన్నర్‌లో తన పక్కనే కూర్చున్న రేవతిని రాబర్ట్ అడిగాడు–

'ఒక పిక్చర్‌లో యాక్ట్ చేస్తే మీకు రెమ్యూనరేషన్ ఎంత ఇస్తారు ?' ....

చెప్పింది రేవతి.

'మీరు నాతో అమెరికా వచ్చేయకూడదూ ?'– కొన్ని క్షణాల తర్వాత రాబర్ట్ అడిగాడు.

రేవతి ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

'మీకు అభ్యంతరం లేకపోతేనే !... నాకింకా మేరేజ్ కాలేదు.. మీకూ కాలేదని తెలుసుకున్నాను... మీరిష్టపడితేనేను.... నేను మిమ్మల్ని మేరేజ్ చేసుకుంటాను !'

ఆమాటకు రేవతి త్రుళ్ళిపడలేదు.... ఆలోచనలో పడింది....

అంతలో రాబర్ట్ మళ్ళీ అన్నాడు–

'న్యూయార్క్ దగ్గర ఓ టౌన్‌లో నాకు పెద్ద థియేటర్ వుంది... అందులో ప్రతిరోజు నాటక ప్రదర్శనలుంటాయి.... మీరు నాతో వుంటే– మరికొన్ని కొత్తనాటకాలు ప్రదర్శించవచ్చు !'....

'అలాగే ! నాకు అభ్యంతరం లేదు !'– వెంటనే తన నిర్ణయాన్ని తెలియచేసింది రేవతి.

'థాంక్యూ !.... నేను అమెరికా వెళ్ళగానే– మీరు అక్కడకు రావటానికి ఏర్పాట్లు చేస్తాను...'– ఉత్సాహంగా చెప్పాడు రాబర్ట్

'కానీ... మన మేరేజ్ ఇక్కడే జరగాలి !'

'ఇక్కడా ?'

'అవును !.... ఇక్కడే !... మీకు అభ్యంతరం లేకపోతే రేపే రిజిష్టర్ మేరేజ్ చేసుకుందాం !'— చెప్పిందామె.

ఆమె నిర్ణయానికి తన అంగీకారాన్ని తెలియచేశాడు రాబర్ట్.

మర్నాడే అతి నిరాడంబరంగా వాళ్ళ పెళ్ళి జరిగిపోయింది. ఆతర్వాత ఇండియాలో రాబర్ట్ పర్యటన— రేవతితో హనిమూన్‌గా మారిపోయింది. మూడు నెలల వ్యవధిలో- తాను ఒప్పుకున్న రెండు సినిమాలూ పూర్తిచేసి రేవతి అమెరికా వెళ్ళిపోయింది....!

మళ్ళీ ఇరవై సంత్సరాల తర్వాత—

ఇప్పుడిలా ఇండియాకు వచ్చింది.... అయితే అప్పటికీ, ఇప్పటికీ ఒక్కటే తేడా !.... అప్పుడు తన భర్త రాబర్ట్‌తో వెళ్ళింది !.... ఇప్పుడు తన కూతురు డాలీతో వచ్చింది !

తన ఏకైక సంతానం డాలీ.... తన కలలకు ప్రతిరూపంగా, తన భవిష్యత్తుకు వారసురాలిగా డాలీని పెంచుకుంది... సంగీతం నేర్పించింది... భారతీయ నృత్యంలో ప్రావిణ్యురాలిని చేసింది !...

ఇరవై సంవత్సరాల క్రితం అనుకోకుండా తనకు వచ్చినట్టే— ఇప్పుడు తన డాలీకి కూడా అవకాశం వచ్చింది !...

అమెరికాలోవుంటున్న తన బంధువుల్ని చూడటానికి వచ్చిన ప్రముఖ దర్శకుడు గుర్నాధం— ఓరోజున రాబర్ట్ థియేటర్‌లో డాలీ నృత్యాన్ని చూశాడు.... ఆమె అంద చందాలకూ, అభినయానికీ పొంగిపోయిన గుర్నాధం— ఆమె 'తెలుగుపిల్ల' అని తెలుసుకుని మరింత ముచ్చటపడ్డాడు.

నృత్య ప్రదర్శన ముగిసిం తర్వాత– రేవతిని కల్పుకుని పరిచయం చేసుకున్నాడు...

'డాలీ' వంటి 'టాలెంట్' కలిగిన ఆర్టిస్టు ఈనాటి సినిమా పరిశ్రమకు కావాలన్నాడు.... రేవతి ఇష్టపడితే– తాను తీయబోయే నృత్య ప్రధానమైన చిత్రంలో డాలీకి- వేషం. అందునా హీరోయిన్ వేషం ఇస్తానన్నాడు... ఒకప్పుడు తాను సినిమా హీరోయిన్‌గా పేరు ప్రఖ్యాతులు గడించుకోవాలని రేవతి తపించిపోయింది... కానీ తప్పని సరి పరిస్థితుల్లో- రాబర్ట్‌ని పెళ్ళిచేసుకుని– ఇండియావదలి వచ్చేసింది!.

ఇప్పుడు మళ్ళీ అలాంటి అవకాశమే తన డాలీకి రాబోతోంది.... అదృష్టం బావుంటే– డాలీ. హీరోయిన్‌గా మంచి పేరు తెచ్చుకుంటే- ఇక ఇండియాలోనే స్థిరపడిపోవచ్చు...

తనను ఎంతగానో ప్రేమించి పెళ్ళిచేసుకున్న రాబర్ట్ చనిపోయి అప్పుడే ఆరేళ్ళయిపోతోంది.... థియేటర్ మీద వస్తున్న అద్దెతోటీ. డాలీ నృత్య ప్రదర్శనలవల్ల వస్తున్న సంపాదనతోటీ– ఈ అయిదేళ్ళ నించీ ఎలాగో నెట్టుకొస్తోంది....

రేపెప్పుడో డాలీకి పెళ్ళిచేయాలి!.... అందుకు డబ్బుకావాలి!... పైగా డాలీకి కూడా సినిమాల్లో చేరాలనివుంది...

అందుకే–

ఆ ఆలోచనతోనే గుర్నాధానికి మాట ఇచ్చింది... తన డాలీని సినిమాల్లో ప్రవేశపెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది రేవతి.

'షూటింగ్ షెడ్యూల్ ప్లాన్ చేసుకున్న తర్వాత తెలియచేస్తాను. మీ అమ్మాయిని తీసుకుని మీరు కూడా రావచ్చు.... అందుకు వీసా

ఏర్పాట్లు కూడా నేనే స్వయంగా చూస్తాను...'— అన్నాడు గుర్నాథం రేవతి దగ్గరనించి అడ్రస్సు, ఇతర వివరాలూ తీసుకుంటూ....

నాలుగు నెలలు తిరక్కుండానే గుర్నాథం దగ్గర్నించి డాలీకి పిలుపు రానేవచ్చింది....

అందుకే—డాలీని వెంటబెట్టుకుని మళ్ళీ ఇండియాకి వచ్చింది రేవతి!!

* * *

"అక్కడ మీకు సౌకర్యంగా ఉందా?" రేవతి వుంటున్న హోటల్ రూంలోకి అడుగు పెడుతూనే ప్రశ్నించాడు గుర్నాథం.

"ఓ యస్! ఈ హోటల్ చాలా బావుంది!" చెప్పిందామె.

"సాయంత్రం స్టోరీ రైటర్ వచ్చి అమ్మాయికి కథ చెప్తాడు! రేపటినించీ షూటింగ్ ప్రారంభం!.... పొద్దున్న ఎనిమిదయ్యేసరికి కారు పంపిస్తాను!"— అన్నాడు గుర్నాథం అక్కడే సోఫాలో కూర్చుంటూ.

తల్లి పక్కనే కూర్చున్న డాలీ — మేగజైన్ తిరగేస్తోంది....

"షూటింగ్ ఎన్నిరోజులుంటుంది? — అడిగింది రేవతి.

"అమ్మాయి వర్కు పదిరోజుల్లో పూర్తయిపోతుంది!"

"పిక్చర్‌లో హీరో ఎవరు?"—కొన్ని క్షణాల తర్వాత ఆమె మళ్ళీ ప్రశ్నించింది.

"సుకుమార్ అని..."

రేవతి ఉలిక్కిపడింది...

"సుకుమారా ?"

"అవును!.... మీరు బహుశా అతని పేరు వినేవుంటారు. ఇప్పటి కప్పుడే మూడువందలకుపైగా సినీమాల్లో యాక్ట్ చేశాడు!"

"అంటే.... ఇరవై ఏళ్ళక్రితం.... 'దుర్మార్గపు మొగుడు' సినీమాలో—' గుర్తుచేసుకుంటూ అన్నది రేవతి.

"కరెక్ట్!... అందులో కూడా అతనే హీరో అని జ్ఞాపకం.... అప్పటికి నేనింకా ఈ ఫీల్డులోకి రాలేదులెండి! కానీ సుకుమార్ ఇండస్ట్రీ కొచ్చి ముప్ఫయ్యేళ్లు దాటిపోయింది!"

రేవతి ముఖంలో రంగులు మారిపోయాయి.... ఆమెకళ్ళు ఎర్రనైనాయి.

"సుకుమార్ ప్రక్కన మా డాలీ 'ఏక్ట్' చేయటానికి వీల్లేదు గుర్నాధంగారూ!"— అంది రేవతి వెంటనే...

మేగజైన్ తిరగేస్తున్న డాలీ — తల్లివైపు అయోమయంగా చూసింది. గుర్నాధంమాత్రం ఖంగారుపడలేదు... ముసిముసిగా నవ్వుతూ చెప్పాడు—

"ఏభై ఏళ్లు పైబడ్డవాని పక్కన హీరోయిన్‌గా నటించటం ఏమిటని ఆలోచిస్తున్నారుకాబోలు!.... మీకు తెలీదు!.... అంతవయ సొచ్చినా సుకుమారు విగ్గుపెట్టుకుంటే-కాలేజీ స్టూడెంట్‌లా కనిపిస్తారు! ఆయనతో సమానంగా ఈనాటి హీరోలు ఎవ్వరూ స్టెప్పులు వేయలేరు!... అసలు ఆయనతో పిక్చరు అనౌన్స్‌చేస్తే చాలు—'రైట్స్' కొనుక్కునేందుకు డిస్ట్రిబ్యూటర్లు ముందేవచ్చి వరసలో నిలబడతారు!"

"కావచ్చు!... కానీ అతని పక్కన హీరోయిన్‌గా మా డాలీని యాక్ట్ చేయనివ్వను!" - అదే తన నిర్ణయం అన్నట్టు - దృఢంగా చెప్పింది రేవతి.

ఈసారి కొంచెం యిబ్బందిలో పడ్డాడు గుర్నాధం.

"మీరెందుకలా అంటున్నారో నాకు అర్ధం కావటంలేదు. ఆయన పక్కన హీరోయిన్ వేషం వెయ్యాలని - ఫీల్డులో వుంటున్న అమ్మాయిలంతా కలలు కంటూంటారు! ఆయనతో నటిస్తేచాలు తమ కెంతో ఫ్యూచర్ వుంటుందని ఆర్టిస్టులంతా భావిస్తారు... అలాంటిది మీరు...."

ఇంకా గుర్నాధం ఏదో చెప్పబోతుండగా - మధ్యలోనే త్రుంచేస్తూ అన్నది రేవతి—

"ప్లీజ్! ఇంకేం చెప్పకండి! ఆయన మహానటుడే కావచ్చు... ఆయన పక్కన నటిస్తేనే చాలు - జన్మ ధన్యమైందని ఎందరో అనుకో వచ్చు... అంతమాత్రంచేత నా నిర్ణయాన్ని మార్చుకోలేను!"—

ఆమె ముఖకవళికల్లో పేరుకుంటున్న తీవ్రతనూ - మాటల్లో ధ్వనిస్తున్న ఆవేశాన్ని చూసి ఇరుకునపడ్డాడు గుర్నాధం....

"తీరా రేపట్నించీ షూటింగ్ ప్రారంభిస్తూంటే — ఈ చివరి నిమిషంలో మీరిలా ప్రాబ్లెం తీసుకొస్తే ఎట్లామేడం?" - అడిగాడు కొంచెం చిరాకుతో.

'నిజమే! మీకు ఇబ్బంది కలిగించాం!... క్షమించండి! మీ పిక్చరులో హీరో సుకుమారు అనే విషయాన్ని మీరు నాకు అమెరికా

లోనే చెప్పివుంటే— మేం ఇండియాకి అసలు వచ్చేవాళ్ళమేకాదు ! అయినా అడక్కపోవటం తప్పు మాదికూడానూ !'

'ఇంతకీ మీకు సుకుమార్ తెలుసా ! ఇలాంటి నిర్ణయానికి ఇంత హఠాత్తుగా మీరెందుకు వచ్చారో తెలుసుకోవచ్చా ?'- అడిగాడు గుర్నాథం కొంత తేరుకున్నాక...

'ఇరవై సంవత్సరాల క్రితం నేను సుకుమార్‌తో 'యాక్ట్'చేసాను ఒకటికాదు— రెండు సినీమాల్లో అతని పక్కన హీరోయిన్ వేషం వేశాను ।'

'ఐసీ !... అయితే ?'

'ఇప్పుడు మళ్ళీ నాకూతురు కూడా అతనితోనే హీరోయిన్‌గా నటించటం నాకు ఇష్టం లేదు... నేను భరించలేను !.... ఇంకేం అడగద్దు !... దయుంచి మా తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసిపెట్టండి !. ఇంతవరకూ మావల్ల మీకెంత ఖర్చయిందో చెప్తే— అణాపైసల్తో ఇచ్చేస్తాను'

రేవతి ఆంతర్యం ఏమిటో అర్థంకాకపోయినా ఆమె నిర్ణయం మాత్రం మరి మారదని తెలుసుకున్న గుర్నాథం నిరాశగా నిట్టూర్చాడు.

* * *

'మమ్మీ ! నన్ను ఆర్టిస్టుని చేయాలని ఎంతో ఆశపడ్డావ్.... తీరా ఇప్పుడు అవకాశం వస్తే— ఎందుకిలా చేశావ్ ?'— విమానం బయల్దేరిం తర్వాత డాలీ అడిగింది.

'నీకూ నాకూ ఒక్కడే హీరో కావటం నాకిష్టంలేదు.... ఇంతకు మించి మరేం చెప్పలేను!'

ఆ సమాధానం డాలీకి తృప్తినివ్వలేదు... ఇంకా ఏదో అడగాలనుకుంది. కానీ ఆపరిస్థితిలో- తన తల్లి మరేం చెప్పదని ఆమెకు తెలుసు. రేవతి కళ్ళు మూసుకుంది.

మూసుకున్న ఆకళ్ళ వెనకాల తాను డాలీకి చెప్పలేని గతం లీలగా కదిలింది. ఇరవైఏళ్ళ క్రితంనాటి ఆగతంలో—

అప్పుడు—

తాను నటిస్తున్న మొదటి చిత్రం తాలూకు షూటింగ్ దాదాపు పూర్తయిపోయింది... ఒకే ఒక పాట మిగిలివుంటే— దాని చిత్రీకరణ కోసం— యూనిట్ అంతా ఊటీ వచ్చింది...

ఆ రోజు రాత్రి సుకుమార్ అన్నాడు—

'నీకు అభ్యంతరం లేకపోతే— నిన్ను 'మేరేజ్' చేసుకోవాలనుకుంటున్నాను!'— పొంగిపోయింది తను!

ఆ ఆనందంలో—ఆ పారవశ్యంలో తన సర్వస్వాన్నీ- అడిగిందే తడవుగా అతనికి అర్పించుకుంది...

రోజులు గడిచిపోయాయి... వారాలు దొర్లిపోయాయి...

ఈలోగా ఒకటి రెండుసార్లు తను- అతని దగ్గర పెళ్ళి ప్రస్తావన తెచ్చింది....

కొంచెం ఓపికపట్టు డార్లింగ్! మరో రెండు మూడు పిక్చర్స్‌లో పనిచేసి నువ్ స్థిరపడితే బావుంటుంది!.... ఈలోగా తొందరెందుకూ?. పైగా పెళ్ళయితే 'ఆఫర్లు' తగ్గిపోతాయి!' అన్నాడు సుకుమార్.

అన్నట్టుగానే ఒకరిద్దరు నిర్మాతలకు తనను పరిచయంచేసి— వేషాలు ఇప్పించాడు....

అలా— తను అతనికి ఇంకా దగ్గరైంది.

తొందరలేదని సుకుమారు అంటున్నా- రేవతి తొందరపడక తప్పలేదు.

ఒకరోజున తాను తల్లి కాబోతున్నట్టు గ్రహించింది... వెంటనే అతన్ని ఆత్రంగా కలుసుకుంది...

'మనం తొందరగా పెళ్ళిచేసుకోవాలి సుకుమారు!'— అంది ఆరాధనగా అతని మెడచుట్టూ తన చేతులు బిగించి...

'ఇదేం సినీమా కాదు! జీవితం'— అన్నాడతను సీరియస్‌గా- ఆమె చేతుల్ని తీసేస్తూ.

తుళ్ళిపడిందామె.

'నీతో పెళ్ళి మావాళ్ళకు ఇష్టంలేదు!— అతి మామూలుధోరణిలో అంతకుముందు అసలేమీ జరగనట్టుగా.

అప్పుడు తను భయంతో ఒణికిపోయింది...

'ఎందుకనీ?'—శక్తిని కూడదీసుకుంటూ- అక్షరాలు వెతుక్కుంటూ ప్రశ్నించింది...

'ఎందుకంటే- సినీమాల్లో నటించే ఆడవాళ్ళపట్ల సదభిప్రాయం లేదుకనుక!'

ఆ సమాధానం విన్న తను దిగ్భ్రాంతిగా చూసింది...

'నాక్కాదు!... మావాళ్ళకి!... పైగా వాళ్ళు నాకు వేరే సంబంధం చూశారు!'— వెంటనే మళ్ళీ చెప్పాడు సుకుమార్....

ఆషాక్‌నించి తను బయటపడి- చూసేలోగానే- సుకుమారు అక్కణ్ణించి వెళ్ళిపోయాడు...

అంతవరకూ- ఆ క్షణం వరకూ అతన్ని ఎంతగానో ఆరాధించి తనకు ఆ క్షణంలో అసహ్యంవేసింది....

'ఇంక తనేం చెయ్యాలి?....'

ఆమె ఆలోచనలకు ఓ రూపం ఏర్పడేలోపలే- తన అదృష్టవశాత్తూ అమెరికన్ కళాకారుల బృందం రావటం- ఆ బృందాన్ని తీసుకొచ్చిన రాబర్ట్ తనను పెళ్ళిచేసుకుని అమెరికా తీసుకుపోవటం- అంతా విచిత్రంగా జరిగిపోయింది....

ఏడు నెలలు నిండకుండానే తాను డాలీని ప్రసవిస్తే- 'ప్రీమెచ్యూర్ డెలివరీ' అని సరిపెట్టుకున్న తన భర్త సహృదయతకి పొంగిపోవాలో భయంకరమైన నిజాన్ని దాచిపెట్టి ఆ మంచివ్యక్తిని వంచించి తన మరుగుజ్జు సంస్కారానికి కృంగిపోవాలో అర్థంకాలేదు రేవతికి!!

* * *

ఆంధ్రభూమి

17-5-1984